# హక్కుల ఉద్యమానికి తాత్విక స్ఫూర్తి



వి.ఎం. తార్కుండే
3.7.1909 - 22.3.2004

ఏడేళ్ళ కింద అనుకుంటాను. ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సంస్థ 'కాశ్మీర్ సమస్య'పై సెమినార్ తలపెట్టింది. వక్తలలో ఒకరు పియుసిఎల్ వ్యవస్థాపకులలో ఒకరయిన వి.ఎం. తార్కుండే. ఆయన బొంబాయి హైకోర్టు రిటైర్డ్ జడ్జి, సుప్రీంకోర్టులో న్యాయవాది. రిజిస్ట్రార్ అనుమతితో నిర్వహించతలపెట్టిన ఆ సెమినార్‌ను ఎబివిపి కార్యకర్తలు జరగనివ్వలేదు. గుంపుగా కర్రలు పట్టుకొనివచ్చి ముందే హాలును ఆక్రమించుకున్నారు. తార్కుండే వస్తే ఆయనను చావగొడతాం అన్నారు. తార్కుండే అప్పటికే వచ్చి ఉన్నారు. ఆయనకేమీ అపాయం జరగకుండ అక్కడినుండి తప్పించడం ప్రధానం అని నిర్వాహకులు భావించారు. సెమినార్ ఆలోచనను వదులుకొని తార్కుండేని తీసుకుపోయారు. అప్పటికి తార్కుండే వయసు 80 దాటింది. కాశ్మీర్ మీద మీటింగ్

కె. బాలగోపాల్

వార్త దినపత్రిక, 24.3.2004

అనేసరికి వచ్చారు. ఆ తరువాత ఆయన బయటకు రావడం దాదాపు మానుకున్నారు. ఢిల్లీ శివారు నొయిడాలో ఉంటూ అక్కడే 22వ తేదీ రాత్రి కన్నుమూసారు.

## వైతాళికులది ప్రత్యేక స్థానం

ఉద్యమాల ప్రారంభకులకెప్పుడూ చరిత్రలో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. వారు ప్రాథమిక సమస్యలను ఎదుర్కొని ఉద్యమాన్ని బట్టకట్టించిన తరువాత ఇతరులు దానిని నడుపుతారు. భారత పౌరహక్కుల ఉద్యమంలో తార్కుండేది అటువంటి పాత్ర. దాదాపు 30 ఏళ్ళ క్రితం ఆయన జీవం పోసిన పౌరహక్కుల ప్రజాసంఘం (పియుసిఎల్) ఇప్పుడొక జాతీయస్థాయి సంస్థ అయింది. దానితోపాటు ఎదిగిన పౌరహక్కుల ఉద్యమం ఇప్పుడు సామాజిక చైతన్యంలో గుర్తింపు పొందింది. అప్పుడప్పుడు కుంటుతూ ఉన్నా దాని ఉనికికీ గుర్తింపుకూ ఢోకాలేదు. మనం రాజకీయంగా విభేదించే వాళ్ళ హక్కుల రక్షణ కోసం మన శ్రమనూ, వనరులనూ ఖర్చు చేయడం చిన్న విషయం కాదు. నక్సలైట్ పార్టీల కార్యకర్తలను బలితీసుకున్న 'ఎన్‌కౌంటర్'ల గురించి దేశవ్యాప్త నిరసన పోగుచేయడంలో తార్కుండే కృషి అసాధారణం. ఆయన రాజకీయంగా 'రాయిస్టు'. రాయిస్టులలో కమ్యూనిస్టు వ్యతిరేకత సర్వసాధారణం. కానీ, నక్సలైట్ల హక్కుల విషయంలో పనిచేసేటప్పుడు తార్కుండే మాటలలోగానీ, ప్రవర్తనలోగానీ ఆ వ్యతిరేకత ధ్వనించేది కాదు. పని చేసే క్రమంలో తీరికగా కూర్చునే సమయం దొరికితే అప్పుడు తన రాజకీయ భావాలను వివరించేవారు. అయితే పౌరహక్కుల పనిలో ఉన్నప్పుడు ఆ ధ్వని వినిపించేది కాదు.

హక్కుల ఉద్యమంలో సహితం, రాజకీయ భావసారూప్యత ఉన్నవారు కూడా విడిపోయి పనిచేయడం అలవరచుకుంటున్న రోజుల్లో తార్కుండే నడవడి ఆదర్శంగా ఉంటుంది. 'కాశ్మీర్ సమస్య'కు ఆయన స్పందించిన తీరు కూడా అసాధారణమైనదే. 'తార్కుండే ఈ మధ్య రావడం లేదెందుకు?' అని ఆయన వయసెంతో తెలియని కాశ్మీరీలు అడుగుతుంటారు. ఒక్కొక్కసారి నిష్టూరమాడుతుంటారు కూడా. కాశ్మీరులో స్వయం నిర్ణయాధికార పోరాటం, దానిపై నిర్బంధం మొదలయిన తరువాత దేశంలోని సగటు పౌరహక్కులవారికి 'దేశ భక్తి'ని అధిగమించి కాశ్మీరీలకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించడానికి కొంత సమయం పట్టింది. గుర్తించాక ఏ మాత్రం తటపటాయించకుండ, వయసును సహితం లెక్కచేయకుండ శ్రీనగర్ పోయి కాశ్మీరీలకు సంఘీభావం తెలిపిన మొదటి పౌరహక్కుల నాయకుడు తార్కుండే.

తార్కుండే రాజకీయంగా రాయిస్టేకాక జయప్రకాష్ నారాయణ్‌కు సన్నిహితుడు కూడ. పౌరహక్కుల విషయంలో నిబద్ధతకు రెండూ తోడ్పడ్డాయి. మన దేశంలో హక్కుల ఉద్యమంలోని కార్యకర్తలలో కమ్యూనిస్టు భావాలు గలవారే మెజారిటీ. ఇది ఆ ఉద్యమానికి బలాన్ని ఇచ్చింది. హక్కుల భావనను పౌరహక్కులకే పరిమితం చేయకుండ మనిషి మనుగడను ప్రాతిపదికగా తీసుకొని విశాలంగా అర్థం చేసుకునే తత్వాన్ని నేర్పింది. పోరాట

లక్షణాన్ని అందిచ్చింది. అయితే కమ్యూనిస్టు భావాలు కలవారు మాత్రమే ఉండిఉంటే కొన్ని రకాల నష్టమూ జరిగి ఉండేది. కమ్యూనిస్టు సిద్ధాంత దృక్పథంలో 'బూర్జువా ప్రజాస్వామ్యం'గా భావించే వ్యవస్థలో అంతర్భాగంగా ఎదిగిన పౌరహక్కులను గురించి లోతయిన అవగాహన హక్కుల ఉద్యమంలో లోపించి ఉండేది. ఆధునిక భారత రాజకీయాలలో 'బూర్జువా ప్రజాస్వామ్యం'లోని హక్కుల కోణాన్ని గురించి మంచి అవగాహన ఉన్న వ్యక్తి రాం మనోహర్ లోహియా. ఆయన నాయకుడిగా ఉండిన సోషలిస్టు ఉద్యమమొక్కటే పౌరహక్కులను తన రాజకీయ అజెండాలో భాగం చేసింది. జయప్రకాశ్ నారాయణ్ తరువాతి రోజులలో ఆ సోషలిస్టు ఉద్యమానికి ప్రధాన నాయకుడయ్యాడు. 1970లలో ఇందిరాగాంధీకి విపరీతమైన ప్రజాదరణ ఉన్న రోజులలో, ఆమె పాలనలోని నియంతృత్వ పోకడలను వ్యతిరేకించిన రాజకీయవేత్త జయప్రకాశ్ నారాయణ్. ఆయన స్ఫూర్తితో బీహార్‌లోనూ, గుజరాత్‌లోనూ బలమైన విద్యార్థి యువజన పోరాటాలు నడిచాయి. పారామిలిటరీ బలగాలను ప్రయోగించి వాటిని అణచివేసారు. ఆ రెండు రాష్ట్రాలలోనూ కొన్ని వందలమంది యువకులూ, విద్యార్థులూ చనిపోయారు. తార్కుండే వంటి మేధావులు (అప్పటికి ఆయన బొంబాయి హైకోర్టు జడ్జిగా రిటైరయి ఉన్నారు) ఈ అణచివేతను నిరసిస్తూ పియుసిఎల్ ఏర్పాటుకు పునాదివేసారు. సోషలిస్టు ఉద్యమానికి లోహియాకాలం నుండి ఉన్న పౌరహక్కుల స్ఫూర్తి కొత్తగా ఆవిర్భవించిన ఈ పౌరహక్కుల ఉద్యమానికి తాత్వికబలాన్ని ఇచ్చింది.

## మరో నేపథ్యం...

దీనికి సమాంతరంగా పశ్చిమ బెంగాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ వేరే నేపథ్యం నుండి పౌరహక్కుల కృషి మొదలైంది. నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి ఆ రాష్ట్రాల పాలకులు అనుసరించిన అణచివేతను నిరసిస్తూ రచయితలూ, ఇతర మధ్యతరగతి జీవులూ ముందుకు రావడం దానికి నాంది. ఈ కృషికి పౌరహక్కుల గురించి నిర్దిష్టమైన అవగాహన ఏమీ లేకున్నా కమ్యూనిస్టు రాజకీయాల్లో భాగమైన ప్రజా పోరాట సంప్రదాయాన్ని హక్కుల ఉద్యమంలోకి అది తీసుకురాగలిగింది. ఈ రెండు స్రవంతులూ 1970, 80లలో ఒకరినొకరు తాత్వికంగా, రాజకీయంగా అనుమానంగా చూసుకుంటూ పనిచేసినప్పటికీ 1990లలో అనుమానాలు తగ్గి పరస్పర అవగాహన పెరిగింది. కమ్యూనిస్టుల పట్ల తన రాజకీయ అభిప్రాయాలు ఏవయినప్పటికీ వారి హక్కుల విషయంలో రాజీలేని వైఖరి అవలంబించిన తార్కుండే ఈ రెండు స్రవంతుల మధ్య పుట్టుకతోనే ఉన్న ఎడాన్ని తగ్గించడానికి ప్రత్యేకమైన ప్రయత్నమేమీ లేకుండానే తోడ్పడ్డారు. ఈ రెండు స్రవంతుల తాత్విక ధోరణుల కలయికే 1990ల తరువాత పౌరహక్కుల ఉద్యమ దృక్పథమయింది. ఆ తరువాతి కాలంలో అంబేద్కరిజం నుండి ప్రధానంగానూ స్త్రీవాదం నుండి కొంతమేరకు ఈ దృక్పథం కొత్త కోణాలు నేర్చుకున్నది. అయితే భిన్నమూలాల నుండి వచ్చిన ఈ భావాలను సమీకరించి ఒక సమగ్రమైన ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందించుకునే కర్తవ్యాన్ని హక్కుల

ఉద్యమం ఇంకా పరిపూర్తి చేయలేదు. రాజకీయ జడత్వం నుండి తాత్విక అపరిపక్వతదాకా దీనికి అనేక కారణాలు ఉన్నాయి. 30 ఏళ్ళనాడు తార్కుండేవంటి కొద్దిమంది ప్రారంభించిన ఈ ఉద్యమం ఇప్పుడు ఇక్కడిదాకా ఎదిగింది. హక్కుల పరిరక్షణలో రాజీ పడని తత్వాన్ని తార్కుండే ఈ ఉద్యమానికి నేర్పారు. ఆ బలాన్ని కాపాడుకుంటూ తాత్విక పరిపూర్ణతను సాధించుకోవడం, ఒక ప్రత్యేకమైన కర్తవ్యాన్ని నిర్దేశించుకోవడం హక్కుల ఉద్యమం చేయవలసిన పని. హక్కుల భావనలోని అన్ని కోణాలను తిరస్కరించి అధికారం, సంపద తప్ప వేరే సామాజిక నీతి ఏదీ లేదనే దిశగా సాగుతున్న ప్రస్తుత పాలనా నీతిని ఎదుర్కోవాలంటే దానికి తాత్విక బలం అవసరం. తార్కుండేవంటి ఉద్యమ ప్రారంభకుల నిబద్ధత అందుకు అవసరమైన సంకల్పాన్ని ఇస్తుందని ఆశిద్దాం.